

పూర్తిగా అడుగంటిపోయిన ర్యాలంపాడు రిజర్వాయర్

# ర్యాలంపాడు ప్రశ్నార్థకమేనా?

- రిజర్వాయర్ రిపేరుతో ముడిపడిన రైతుల భవిష్యత్
- 2019లో లీకేజీతో రెండు టీఎంసీలకు కుదింపు
- పూర్తి స్థాయిలో నీరొచ్చినా.. వినియోగించుకోలేని దుస్థితి
- 1.36 లక్షల ఎకరాలకు రెండో పంటకు అందని నీరు
- అబ్జర్వేషన్, విచారణ పేరుతో అధికారుల కాలయాపన
- పరిష్కారం చూపాలంటున్న ఆయకట్టు రైతులు

ధరూరు, మే 20 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్ కింద ఆయకట్టు రైతులకు సాగునీరందంచడానికి జవహర్ నెట్టెంపాడ్ ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేశారు. 2లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరం దించేందుకు రెండు ప్రధాన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల ప్రణాళికతో దీన్ని రూపొందించారు. 21 టీఎంసీల నీటిని వినియోగించే ఉద్దేశంతో రూపొందించిన ఈ ప్రాజెక్ట్ ధరూరు మండలంలోని ఉప్పేరు వద్ద నీటిని ఎత్తిపోయడంతో మొదలవుతుంది. మొదటి లిఫ్ట్ ద్వారా గుడ్డెందొడ్డి రిజర్వాయర్‌కు, రెండో లిఫ్ట్ ద్వారా ర్యాలంపాడు ఫేజ్-2 రిజర్వాయర్‌కు నీటిని తరలించి, ప్రణాళికాబద్ధంగా రెండు పంటలకు వినియోగించాలి. మొదటి లిఫ్ట్ నుంచి 8 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ర్యాలంపాడు రిజర్వాయర్ సమస్యల వలయంలో చిక్కుకున్నది. నాసిరకమైన పనుల కారణంగా నీటిని నిల్వ ఉంచుకోలేకపోతున్నది. నాలుగు టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన ర్యాలంపాడు రిజర్వాయర్.. కుడి కాల్వల అనుసంధానం ద్వారా 1,11,000 ఎకరాలు, ఎడమ కాల్వల అనుసంధానం ద్వారా 25,000 ఎకరాల ఆయకట్టు విస్తీర్ణాన్ని కలిగి ఉన్నది. 2012లో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ 2014 నుంచి నీటిని అందిస్తూ కులవృత్తుల వారు, ప్రాజెక్ట్ నిర్మాణంలో భూములు కోల్పోయిన వారు అక్కడి కాల్వల వెంట చేపల పై సెంటర్లు పెట్టుకొని జీవనాధారం పొందేవారు. రైతులు కూడా రెండు పంటలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంబురంగా సాగు చేసుకునే వారు. 2019లో నీటి బుడగల లీకేజీతో ప్రాజెక్ట్‌లో నీటిని నిల్వ ప్రశ్నార్థకంగా మారింది. దీంతో ప్రాజెక్ట్‌ను ప్రత్యేక బృందాలు పరిశీలించి నాలుగు టీఎంసీల నిల్వను రెండు టీఎంసీలకు కుదించారు. వర్షాలు కురవడంతో 2023 వరకు రెండు పంటలకు అధికారులు సాగునీరు అందిస్తూ వచ్చారు. ప్రస్తుతం మాత్రం మొదటి పంట ప్రారంభానికే ప్రభుత్వం చేతులెత్తేసి, రెండో పంట వేయొద్దని హెచ్చరించింది. దీంతో ఆయకట్టు రైతులకు అన్నీ ఉన్నా.. అల్లుని నోట్లో శని అన్నట్లుగా.. రిజర్వాయర్‌తో రైతులకు మేలు జరుగుతుందనుకుంటే లీకేజీలతో ఇబ్బందులు తలెత్తాయి.

***ర్యాలంపాడు ఆయకట్టు వివరాలు..***

105, 106,107, 108 ప్యాకేజీల కుడి కాల్వలు 1,11,000 ఎకరాలు, 104 ఎడమ కాల్వ ప్యాకేజీ కింద 25వేల ఎకరాలు, కుడి కాల్వ కింద తాటికుంట రిజర్వాయర్ 1.5 టీఎంసీలు, నాగర్‌దొడ్డి రిజర్వాయర్ 0.6 టీఎంసీలు, ముచ్చోనిపల్లి రిజర్వాయర్ 1.5 టీఎంసీలు, చిన్నోనిపల్లి రిజర్వాయర్ 1.5 టీఎంసీల సామర్థ్యంతో ర్యాలంపాడు, సద్దలోనిపల్లి, మల్దకల్, అయిజ, మేడికొండ, గట్టు, ఆరగిద్ద, చమన్‌ఖాన్‌దొడ్డి, టీటీదొడ్డి, చాగదోణ, భూంపురం, వడ్డేపల్లి, రాజోళి మండలాల రైతులకు 48 కిలోమీటర్ల మెయిన్ కెనాల్స్ ద్వారా సాగునీటిని సరఫరా చేస్తున్నాయి. 104 ప్యాకేజీ 5కింద 5 కిలోమీటర్ల మెయిన్ కెనాల్స్ కేటీదొడ్డి, ధరూరు మండలాలకు సాగునీటిని సరఫరా చేస్తున్నాయి.



బీళ్లుగా మారిన ర్యాలంపాడు ఆయకట్టు

### మూడు కమిటీలు పరిశీలించాయి..



ర్యాలంపాడ్ రిజర్వాయర్‌ను ఇప్పటి వరకు మూడు కమిటీలు పరిశీలించి పలు సూచనలు చేశాయి. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇరిగేషన్, ఈఎన్‌సీ, ఎక్స్‌పర్ట్ కమిటీలు పరిశీలించాయి. ప్రస్తుతం జియోమంబ్రె పాలిథిన్ ఉపయోగించొద్దని సూచనలు చేశారు. మొత్తం మరమ్మతులు చేయాలా? ఉన్న దాంట్లో కొన్నింటిని సరిచేస్తే సరిపోతుందా అని బృందాలు పరిశీలిస్తున్నాయి. ప్రస్తుతం మరమ్మతులకు రూ.157కోట్ల వరకు ఖర్చు అవుతుందని నివేదిక పంపగా ఉన్నతాధికారుల పరిశీలనలో ఉన్నది. సమగ్రంగా పరిశీలించిన తర్వాత చర్యలు తీసుకుంటాం.

*- వెంకటేశ్వరరావు, ఈఈ, ర్యాలంపాడు రిజర్వాయర్*

### కేసీఆర్ హయాంలో నీళ్లు ఫుల్..



కేసీఆర్ హయాంలో ఎమ్మెల్యే చొరవతో ర్యాలంపాడ్ రిజర్వాయర్ ద్వారా రెండు పంటలకు సరిపడా సాగునీరు అందించాం. రిజర్వాయర్‌కు మరమ్మతులు చేయకపోతే రైతులకు సాగునీటి కష్టాలు తప్పవు. ర్యాలంపాడులో నీళ్లు ఉంటేనే గ్రామాలకు సాగునీరు సరఫరా అవుతుంది. సబ్ రిజర్వాయర్లు లేనందున ఇక్కడి నుంచి వదిలిన కాల్వలే ప్రత్యక్ష ఆధారం. ర్యాలంపాడులో స్టోరేజీ ఉంటేనే సాధ్యమవుతుంది. ఇకనైనా కష్టాలు గుర్తించి పరిష్కారం చూపాలి.

*- సుదర్శన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ, ధరూరు*



గ్రామస్తులు అడ్డుకోవడంతో నిలిచిన టిప్పర్లు

# ఇసుక టిప్పర్ల అడ్డగింత

- అనుమతులు లేకుండా తీస్తున్నారని గ్రామస్తుల ఆగ్రహం
- రీచ్ ఒకచోట, ఇసుక తీసేది మరోచోట అంటూ కన్నెర్ర
- భూగర్భజలాలు ఇంకిపోతున్నాయని ఆందోళన

కల్వకుర్తి, మే 20 : మండలంలోని గుండూర్ గ్రామస్తులు సోమవారం ఇసుక టిప్పర్లను అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా ఇసుకను తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక తీయడం వల్ల భూగర్భజలాలు తగ్గడంతో పాటు పంటలు ఎండిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాడూర్ మండలంలో ఇసుక తీయడానికి రీచ్‌కు అనుమతిస్తే గుండూర్ పరిధిలో ఎందుకు తీస్తున్నారని వారు నిలదీశారు. గ్రామం నుంచి ఇసుక ట్రాక్టర్లు తిరగడం వల్ల రోడ్డు ధ్వంసమవుతున్నదని మండిపడ్డారు. ఇసుక అక్రమ రవాణపై ఇదివరకే అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు, రైతులు వాపోయారు. ప్రజాప్రతినిధులు, అధికారుల అండతోనే ఇసుకను బాహాటంగా తీస్తున్నారని, గుండూర్ సమీపంలోని దుందుభి వాగునుంచి ఇసుకను తీయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని గ్రామస్తులు తేల్చి చెప్పారు. గ్రామస్తులు అడ్డుకోవడంతో దాదాపు 40 ఇసుక టిప్పర్లు నిలిచిపోయాయి.



పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

# టెట్ ప్రారంభం

పాలమూరు, మే 20 : ఉపాధ్యాయ అర్హత ఆన్‌లైన్ పరీక్షను సోమవారం స్థానిక జేపీఎన్‌సీఈ, ఫాతిమా విద్యాలయ పాఠశాలలో నిర్వహించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి గంటన్నర ముందుగానే చేరుకోగా ఉదయం 9 నుంచి 11:30 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2 నుంచి 4:30 గంటల వరకు కొనసాగింది. మొత్తం 738 మందికి గానూ 680 మంది పరీక్షకు హాజరుకాగా 58మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

# ఎదురెదురుగా కార్లు ఢీ

- ఆరుగురికి తీవ్రగాయాలు

కల్వకుర్తి, మే 20 : రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొని ఆరుగురికి గాయాలైన ఘటన మండలంలోని తాండ్ర సమీపంలో కోదాడ- జడ్చర్ల ప్రధాన రహదారిపై చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. హైదరాబాద్‌కు చెందిన శ్రీలత, శ్రీవిద్య, దేవి, సాయితేజ కారులో శ్రీశైలానికి వెళ్లి సోమవారం తిరిగొస్తున్నారు. తలకొండపల్లి మండలం చుక్కాపూర్‌కు చెందిన ఎనిమిదిమంది మరో కారులో శ్రీశైలానికి వెళ్తున్నారు. ఈ రెండు కార్లు తాండ్ర సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘటనలో శ్రీలత, శ్రీవిద్య, దేవి, సాయితేజతోపాటు సాయి, విజయ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా క్షతగాత్రులను వెల్దండ సమీపంలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఈ విషయమై ఎస్సైని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.



ఎదురెదురుగా ఢీకొన్న కార్లు



నాగర్‌కర్నూల్ జిల్లాలో దుక్కి దున్నుతున్న రైతన్న

**2024 వానకాలం సాగు ప్రణాళిక (ఎకరాల్లో)**

| పంట | సాధారణ విస్తీర్ణం | 2023 సాగు | 2024 అంచనా |
|---|---|---|---|
| పత్తి | 3,60,795 | 2,35,961 | 2,73,720 |
| వరి | 89,608 | 1,48,513 | 1,40,082 |
| కందులు | 15,697 | 3,051 | 3,755 |
| మొక్కజొన్న | 65,685 | 48,662 | 45,237 |
| జొన్న | 6,279 | 2,943 | 3,442 |
| మినుములు | 660 | 692 | 747 |
| పొద్దుతిరుగుడు | 1,404 | 82 | 294 |
| వేరుశనగ | 1,280 | 822 | 847 |
| ఇతర పంటలు | 6,321 | 521 | 5,636 |

# సాగుకు సన్నద్ధం

- వానకాలం పంటల ప్రణాళిక ఖరారు
- కందనూలులో 4.73 లక్షల ఎకరాల్లో సేద్యం
- పత్తి పంటకే అధిక ప్రాధాన్యమిస్తున్న రైతులు
- 2.73లక్షల ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా..
- రెండోస్థానంలో వరి 1.40 లక్షల ఎకరాల్లో..
- విత్తనాలు, ఎరువుల అంచనా పూర్తి
- ప్రభుత్వానికి వ్యవసాయశాఖ నివేదిక

నాగర్‌కర్నూల్, మే 20 (నమస్తే తెలంగాణ) : వానకాలం సాగుకు వ్యవసాయశాఖ సన్నద్ధమవుతున్నది. జిల్లాలో ఈ సీజన్‌లో పండించే పంటలపై పూర్తిస్థాయి నివేదికను వ్యవసాయశాఖ అధికారులు రూపొందించారు. ఎప్పటిలాగే కందనూలు రైతులు పత్తి పంటకే జై కొట్టనుండగా ఆ తర్వాతి స్థానంలో వరి ఉన్నది. జిల్లాలో మొత్తం 4.73లక్షల ఎకరాల్లో ఆయా పంటలను సాగు చేయనుండగా అవసరమైన ఎరువులు, విత్తనాలను కూడా అందుబాటులో ఉంచేలా వ్యవసాయశాఖ ప్రణాళికలు రూపొందించింది.

***సాగు ప్రణాళిక సిద్ధం..***

వానకాలం పంటల ప్రణాళికను వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. జిల్లాలో 20మండలాల వారీగా రైతులు సాగు చేసే పంటల తుది అంచనాను రూపొందించింది. ఈసారి వానలు సకాలంలో కురుస్తాయన్న వాతావరణ శాఖ సమాచారంతో అన్నదాతలు సాగుకు సమాయత్తమవుతున్నారు. జిల్లా రైతులు ఎప్పటిలాగే పత్తి పంటకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. సాధారణ పత్తి సాగు అంచనా 3.60లక్షలు ఉండగా గతేడాది 2.35లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఈసారి 2.73లక్షల ఎకరాల్లో సాగు కావచ్చని అధికారులు భావిస్తున్నారు. వరి సాధారణ సాగు అంచనా 89వేల ఎకరాలుండగా గతేడాది 1.48 లక్షల ఎకరాల్లో సాగయ్యింది. ఈసారి 1.40లక్షల ఎకరాల్లో సాగు చేస్తారని తెలుస్తున్నది. పత్తి సాధారణ సాగుతో పోలిస్తే వరి సాగు సాధారణానికి మించి చేసే పరిస్థితులున్నాయి. ఇప్పటికే యాసంగి ధాన్యం అమ్మకాలు తుదిదశకు చేరుకున్నాయి. ఈ ఏడాది ఎండలు తీవ్రంగా ఉండడంతో రైతులు కొంచెం ఆలస్యంగా దుక్కులు చేసుకున్నారు. కాగా వర్షాలు సకాలంలో కురుస్తాయన్న సమాచారంతో ముందస్తు సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. అయితే ఒకట్రెండు వర్షాలకు పంటలు సాగు చేసుకోవద్దని, భూమిలో వేడి తగ్గి చల్లబడ్డాకే విత్తనాలు వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో జూన్ రెండోవారం నాటికి వరి నాట్లు, పత్తి విత్తనాలు నాటేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వ్యవసాయశాఖ అధికారులు కూడా గ్రామస్థాయిలో రైతులకు సాగుపై అవగాహన కల్పిస్తున్నారు. గతేడాది వర్షాభావంతో చెరువులు, కుంటల్లో నీళ్లు లేకపోవడం, భూగర్భ జలాలు అడుగంటాయి. ఈనేపథ్యంలో ప్రస్తుతం వర్షాలు భారీగా కురిస్తేనే ఈ సీజన్ గట్టెక్కే పరిస్థితులు ఉన్నాయి. ఈమేరకు ఉన్న పరిస్థితులను బట్టి సాగు అంచనాను వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి పంపించింది. జూన్ 1 నాటికి నైరుతి రుతుపవనాలు వస్తాయని చెబుతుండగా.. 7న మృగశిర కార్తె ప్రవేశిస్తుంది. ఆ తర్వాతే వానలు కురుస్తాయని రైతులు నమ్ముతారు. ఇదిలా ఉండగా 5.47 లక్షల సాధారణ సాగుకు గానూ ఈ ఏడాది వానకాలంలో 4.73 లక్షల ఎకరాల్లో సాగు ఉండనున్నట్లుగా అధికారులు అంచనాలను సిద్ధం చేశారు. దీనికి సరిపడా విత్తనాలు, ఎరువులను కూడా అందుబాటులో ఉంచనున్నది. పత్తి, వరి, జొన్న, మొక్కజొన్న వంటి పంటల సాగుకు అవసరమైన 9లక్షల క్వింటాళ్ల విత్తనాలు, యూరియా, డీఏపీ, ఎంవోపీ, ఎస్ఎస్‌పీ, కాంప్లెక్స్ వంటి 1.30 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల ప్రణాళికను కూడా తయారు చేసింది.

### పత్తికే ఫస్ట్ ప్రయారిటీ..



ఈ ఏడాది 4.73లక్షల ఎకరాల్లో పత్తి, వరి, వేరుశనగ, కందులు, జొన్న, ఇతర పంటలను సాగు చేయనున్నారు. ఇందుకోసం అవసరమైన 9లక్షల క్వింటాళ్ల విత్తనాలు, 1.30 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను సిద్ధంగా ఉంచాం. తొలకరి వానలు కురిసి భూమిలో వేడి తగ్గి, తేమ శాతం పెరిగాకే విత్తనాలు నాటుకోవాలి. వేసవి దుక్కులు దున్నుకోవాలి. భూసార పరీక్షలు చేయించుకుంటే బాగుంటుంది. జిల్లాలోని రైతులు పత్తి, వరి పంటలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈసారి సాధారణ సాగుకు మించి వరి సాగయ్యే అవకాశం ఉన్నది.

*- చంద్రశేఖర్, డీఏవో, నాగర్‌కర్నూల్ జిల్లా*



| ఎరువు | అంచనా (మెట్రిక్ టన్నుల్లో) |
|---|---|
| యూరియా | 53,475 |
| డీఏపీ | 18,085 |
| ఎంవోపీ | 3,351 |
| ఎస్ఎస్‌పీ | 1,862 |
| కాంప్లెక్స్ | 53,981 |

- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా వానలు
- జడ్చర్లలో జలమయమైన రోడ్లు.. తడిసిన ధాన్యం
- ఆలూర్ రైల్వే అండర్‌పాస్ వద్ద నిలిచిన వర్షపు నీరు
- ఉండవెల్లి, తిమ్మాజిపేటలో నేలకొరిగిన చెట్లు
- ఇబ్బందులు ఎదుర్కొన్న వాహనదారులు
- ఈదురుగాలులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం
- గన్యాగులలో పిడుగుపాటుకు ఆరు గొర్రెలు, 2 పొట్టేళ్లు మృతి



జడ్చర్ల పట్టణ రహదారిపై నిలిచిన వర్షపు నీటిలో వెళ్తున్న వాహనదారులు

# పాలమూరులో భారీ వర్షం



జడ్చర్ల మండలం ఆలూర్ గ్రామానికి వెళ్లే రైల్వేఅండర్ బ్రిడ్జి వద్ద నిలిచిన వర్షపు నీటిలో వెళ్తున్న వాహనదారులు

జడ్చర్ల టౌన్/ఉండవెల్లి/తిమ్మాజిపేట/అచ్చంపేట టౌన్/నాగర్‌కర్నూల్, మే 20 : జడ్చర్ల పట్టణంలో సోమవారం కురిసిన అకాల వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం కురవగా లోతట్టు ప్రాంతాలైన వెంకటేశ్వరకాలనీ, శివాజీనగర్, రాజీవ్‌నగర్, బొవెలకుంట ప్రాంతాల్లోకి నీరు భారీగా చేరింది. మార్కెట్ యార్డులోని ధాన్యం బస్తాలు తడిసిపోగా.. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు లారీల్లోకి ఎక్కిస్తుండగా తడిసినట్లు వ్యాపారులు తెలిపారు. జడ్చర్ల ఫ్లై ఓవర్, పట్టణ ప్రధాన రహదారిపై, ఆలూర్ రైల్వే అండర్ బ్రిడ్జి కిందికి నీరు చేరి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. రైల్వే అండర్‌పాస్‌లో వర్షపు నీరు నిలవకుండా రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కోడుగల్, ఆలూర్, గంగాపూర్, మాచారం, బూరెడ్డిపల్లి, మల్లెబోయిన్‌పల్లి గ్రామాల్లో ఈదురుగాలులతో వీస్తుండటంతో అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఉండవెల్లి మండలం బొంకూరులో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఎగువన కురిసిన వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. తిమ్మాజిపేట నుంచి జడ్చర్ల-నాగర్‌కర్నూల్ వెళ్లే దారిలో ఇంద్రానగర్, తండా సమీపంలో చెట్లు విరిగి రోడ్డుపై పడడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఎస్సై నరేందర్ రెడ్డి అక్కడికి చేరుకొని జేసీబీల సాయంతో చెట్లను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. అచ్చంపేట బస్టాండ్‌లో నిలిచిన వర్షపు నీటిని సిబ్బంది తోడివేశారు. నాగర్‌కర్నూల్ మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. ఈక్రమంలో గన్యాగులలో పిడుగుపాటుకు గుర్రై వెంకటయ్యకు చెందిన ఆరు గొర్రెలు, రెండు పొట్టేళ్లు మృతి చెందాయి. కండ్లముందే జీవాలు చనిపోవడంతో యజమాని కన్నీరుమున్నీరయ్యాడు. రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని, బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. ఇదిలా ఉండగా, వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో దుక్కులు దున్ని విత్తనాలు వేసేందుకు రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు.









నాగర్‌కర్నూల్ : గన్యాగులలో మృతి చెందిన గొర్రెలతో యజమాని వెంకటయ్య, తిమ్మాజిపేట : రోడ్డుపై పడిన చెట్టు, ఉండవెల్లి : బొంకూరులో నేలకొరిగిన వృక్షం, అచ్చంపేట టౌన్ : బస్టాండ్‌లో నీటిని ఎత్తిపోస్తున్న ఆర్టీసీ సిబ్బంది